నెన్నెల తహసీల్దార్, ధరణి ఆపరేటర్ సస్పెండ్

నెన్నెల ఏప్రిల్ 7: పట్టాదారు బతికి ఉండగానే చనిపోయినట్లు రికార్డులు సృష్టించి మరొకరి పేరిట భూమి పట్టా చేసిన విషయంలో నెన్నెల తహసీల్దార్ సబ్బ రమేశ్, ధరణి ఆపరేటర్ ఉదయ్‌ను కలెక్టర్ దేశాల మేరకు ఉన్న తాధికారులు సస్పెండ్ చేశారు. ఇటీవల మండలంలోని చిన్న వెంకటాపూర్‌లో మంచిర్యాలకు చెందిన కుందునూరి శ్రావ్య రెడ్డి పేరిట ఉన్న పట్టా భూమిని గంగారం గ్రామానికి చెందిన చిర్రం రమేశ్‌కు అక్రమంగా తప్పుడు ధ్రువీకరణ పత్రాలు సృష్టించి రెండు ఎకరాలు పట్టా చేశారు. శ్రావ్యరెడ్డి మామ అశోక్‌రెడ్డి ఫిర్యాదు చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు బెల్లంపల్లి ఆర్డీవో హరికృష్ణ విచారణ చేపట్టి నివేదిక ఇచ్చారు. దాని ప్రకారం తహసీల్దార్ రమేశ్, ఆపరేటర్ ఉదయ్‌ను సస్పెండ్ చేసినట్లు జిల్లా అధికారులు తెలిపారు. తహసీల్దార్ రమేశ్ సస్పెండ్‌కు గురికావడంతో డిప్యూటీ తహసీల్దార్ ప్రకాశ్‌కు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు.

భూ వివాదంలో ముగ్గురికి జైలు శిక్ష

భీమారం, ఏప్రిల్ 7 మండలంలోని మద్దికల్ గ్రామ శివారు ప్రాంతంలోని దహగామ ఉమామహేశ్వర్ రావు చెందిన సర్వే నంబర్ 708, 712, ఏసీ 26 సెంట్ల భూమిలో అక్రమంగా చొరబడి భూమి ట్రాక్టర్‌తో భూమి దున్నడాన్ని అడ్డగించి పని ఆపకపోతే చంపుతామని బెదిరించిన, మద్దికల్ గ్రామానికి చెందిన చిలకానీ కనకయ్య, చిలకానీ మాదయ్య, బందం శ్రీనివాస్‌కు సంవత్సరం పాటు సాధారణ జైలు శిక్ష విధిస్తూ చెన్నూరు ప్రథమ శ్రేణి న్యాయమూర్తి పర్వతపు తీర్పును వెలువరించినట్లు ఎస్ఐ. కే శ్వేత తెలిపారు. 16.6.2018 సంవత్సరంలో దహెగాం ఉమామహేశ్వర్ రావు స్థానిక పోలిస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా అప్పటి ఎస్ఐ. ఎల్ మంగీలాల్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. ఈ కేసులో 10 మంది సాక్షులను కోర్టు పోలీస్ అధికారి డీ. రాజ్ కుమార్ ప్రవేశపెట్టగా అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ నంది రవీందర్ సాక్షులను విచారించి నేరాన్ని రుజువు చేసినట్లు వారు తెలిపారు.

పేకాడిన వారిపై కేసు

దహెగాం, ఏప్రిల్ 7: మండలంలోని చిన్న రాస్పల్లిలోని అమర్‌గొండ గ్రామ శివారులో పేకా ఆడుతూ పట్టుబడిన నలుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ కందూరి రాజు తెలిపారు. అమర్‌గొండ శివారులో పేకాడుతున్నట్లు సమాచారం అందడంతో తనిఖీ చేయగా చిన్నరాస్పల్లికి చెందిన సామెర తిరుపతి, సామెర జలపతి, సామెర సత్తయ్యతో పాటు చంద్రపల్లికి చెందిన ఆత్రం మారయ్య పేకాడుతూ పట్టుబడ్డారు. వారివద్ద నుంచి రూ.880 స్వాధీనం చేసుకొని వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

గడ్డి వాము దగ్ధం

నెన్నెల, ఏప్రిల్ 7: మండలంలోని ఆవుడం గ్రామానికి చెందిన ఆడి లింగయ్యకు చెందిన గడ్డి వాము అనుమానాస్పదంగా కాలినట్లు బాధితుడు తెలిపారు. సోమవారం మధ్యాహ్నం ఎవరో నిప్పు పెట్టడంతో మంటలు అంటుకున్నాయి. ఆర్పేందుకు ప్రయత్నించినా ఫలితంగా లేకపోయింది. గడ్డి వాము పూర్తిగా దగ్ధం కాగా, రెండు ఆవులకు స్వల్ప గాయాలయ్యాయి. రూ. 10 వేల వరకు నష్టం వాటిల్లినట్లు తెలిపారు.

ఇద్దరి బైండోవర్

బెజ్జూర్, ఏప్రిల్ 7 : మండల కేంద్రంలోని తహసీల్ కార్యాలయంలో సోమవారం తహసీల్ భూమేశ్వర్ మందు ఇద్దరిని బైండోవర్ చేసినట్లు ఎస్ఐ ప్రవీణ్ తెలిపారు. గతంలో వీరు గైసిల్ పత్తి విత్తనాలను సరఫరా చేశాడని, మరోసారి ఇలాంటి విత్తనాలను సరఫరా చేయవద్దని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పోలీసులు, రెవెన్యూ అధికార సిబ్బంది పాల్గొన్నారు.

అక్రమంగా మొరం తరలింపు

- జేసీబీ సీజ్

జన్నారం, ఏప్రిల్ 7 : డివిజన్‌లోని ఇందన్‌పెల్లి రేంజ్ పరిధిలోని కవ్వాల్ టైగర్ రిజర్వుడు అడవుల్లో అక్రమంగా మొరాన్ని తవ్వి తరలిస్తున్న బుట్టాపూర్‌కు చెందిన మహేశ్ జేసీబీని పట్టుకొని సీజ్ చేసినట్లు రేంజ్ ఆఫీసర్ కారం శ్రీనివాస్ తెలిపారు. అక్కడి నుంచి తరలించిన మొరం విలువ రూ.55వేలు ఉంటుందని తెలిపారు.

లక్షెట్టిపేట ఎస్ఐగా గోపతి సురేశ్

లక్షెట్టిపేట, ఏప్రిల్ 7 : మండల నూతన ఎస్ఐ గా గోపతి సురేశ్ సోమవారం పోలీస్ స్టేషన్లో బాధ్యతలు స్వీకరించారు. ఈయన ఇంతకుముందు హాజీపూర్ మండల ఎస్ ఐగా విధులు నిర్వహించారు. ఇక్కడి ఎస్ఐ సతీశ్ కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాకు బదిలీకావడంతో ఆయన స్థానంలో జీ సురేశ్ బదిలీపై వచ్చి బాధ్యతలు స్వీకరించారు.

దరఖాస్తుల ఆహ్వానం

మంచిర్యాల అర్బన్, ఏప్రిల్ 7: జిల్లా వైద్య ఆరోగ్య శాఖలో ఒప్పంద ప్రతిపాదికన జాతీయ ఆరోగ్య మిషన్ (ఎన్‌హెచ్ఎం) నందు మంజూరైన (డీడీఎం) డిస్ట్రిక్ట్ డాటా మేనేజర్ పోస్టును భర్తీ చేసేందుకు నోటిఫికేషన్ విడుదల చేసినట్లు మంచిర్యాల డీఎంహెచ్‌వో హరీశ్‌రాజ్ తెలిపారు. ఈ నెల 8 నుంచి 11 సాయంత్రం 5గంటల వరకు దరఖాస్తులను డీఎంహెచ్‌వో కార్యాలయంలో సమర్పించాలని తెలిపారు. వివరాలకుhttps://mancherial.telangana.gov.in సందర్శించాలని సూచించారు.

విద్యుత్‌శాఖలో ఆన్‌లైన్ ఎల్‌సీ యాప్

మంచిర్యాలటౌన్, ఏప్రిల్ 7: విద్యుత్ వినియోగదారులకు మరింత నాణ్యమైన సేవలందించడంలో భాగంగా ఆన్ లైన్ ఎల్సీ (లైన్ క్లియర్) యాప్‌ను ప్రవేశపెడుతున్నామని మంచిర్యాల సర్కిల్ సూపరింటెండెంట్ ఇంజినీర్ వీ గంగాధర్ సోమవారం తెలిపారు. ఎల్సీలు తీసుకొని పనిచేసే సమయంలో చాలా మానవ తప్పిదాలతో ఉద్యోగులకు ప్రమాదాలు జరుగుతున్నాయని, వీటిని నివారించడానికి ఆన్ లైన్ ఎల్సీ(లైన్ క్లియర్) యాప్‌ను అందుబాటులోకి తీసుకువచ్చామని చెప్పారు. సంబంధిత ఏఈ అనుమతి లేకుండా తీసుకునే ఎల్సీ లను నివారించవచ్చన్నారు.

డీఈవోకు వినతి

నస్పూర్, ఏప్రిల్ 7 : ఎస్ఏ 2 పరీక్ష పత్రాలను పాత విధానం ప్రకారం ఒకే రోజు తీసుకువెళ్లి ప్రధానోపాధ్యాయుల ఆధీనంలో లేక డీసీబీ ఆధీనంలో ఉండేలా ఆదేశాలు జారీ చేయాలని కోరుతూ రాష్ట్రోపాధ్యాయ సంఘం నాయకులు సోమవారం డీఈవో యాదయ్యకు వినతిపత్రం అందించారు. ఈ నెల 9 నుంచి ప్రారంభం కాబోతున్న ఎస్ఏ 2 పరీక్షలకు సంబంధించిన ప్రశ్నపత్రాలను ఏ రోజుకారోజు సంబంధిత ప్రధానోపాధ్యాయుల నుంచి కొన్ని మండలాల్లో యూపీఎస్‌ల నుంచి తీసుకువెళ్లడం ద్వారా సమయభావం ఏర్పడుతుందని, భారం కూడా పడుతుందని తెలిపారు. పాత విధానం అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్రోపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి బాపు, అసోసియేట్ అధ్యక్షుడు సత్తయ్య, ఉపాధ్యాయులు పద్మ, మన్మోహన్, మహాలక్ష్మి, రజిత తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

లక్షెట్టిపేట, ఏప్రిల్ 7 : నిబంధనలు ఉల్లంఘించే పాఠశాలలు నిర్వహిస్తే చర్యలు తప్పవని ఎంఈవో హెలెన్ డారతి హెచ్చరించారు. సోమవారం పట్టణంలోని బ్రిలియంట్ మోడల్ హైస్కూల్ ను ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా తరగతులు నిర్వహిస్తున్నారని సమాచారంతో ఎంఈవో హెలెన్ డారతి తనిఖీ చేశారు. విద్యాశాఖ ఉత్తర్వులకు విరుద్ధంగా ఒంటి పూటకు బదులుగా రెండు పూటలు బడిని నిర్వహిస్తుండడంతో పాఠశాల సిబ్బందిని హెచ్చరించారు. ఇలాంటివి పునరావృతమైతే రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వులకు మేరకు చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

నకిలీ విత్తనాలు వాడవద్దు

వేమనపల్లి, ఏప్రిల్ 7 : రైతులు నకిలీ పత్తి విత్తనాలను వాడవద్దని నీల్వాయి ఎస్ఐ శ్యామ్‌పటేల్, మండల వ్యవసాయాధికారి వీరన్న పేర్కొన్నారు. సోమవారం వేమనపల్లిలో పోలీసులు, వ్యవసాయాధికారులు సంయుక్తంగా ర్యాలీ తీశారు. నకిలీ విత్తనాలను ఉపయోగించడం వల్ల భూసారం తగ్గి పంటల దిగుబడి రాక నష్టపోతారని తెలిపారు. గ్లైసిల్ విత్తనాలు అమ్మినా, కొన్నా , నిల్వ చేసినా నేరమని తెలిపారు. లైసెన్స్ ఉన్న దుకాణాల్లోనే విత్తనాలు కొనాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రాంచందర్, రైతులు, పోలీసులు, వ్యవసాయాధికారులు పాల్గొన్నారు.

ప్రజావాణిని సద్వినియోగం చేసుకోవాలి

కోటపల్లి, ఏప్రిల్ 7 : ప్రతి సోమవారం కోటపల్లి తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోటపల్లి తహసీల్దార్ రాఘవేంద్రరావ్ కోరారు. కోటపల్లి లో నిర్వహించిన ప్రజావాణికి హాజరై వినతులను స్వీకరించారు. వేసవికాలం దృష్ట్యా ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చే ప్రజల సౌకర్యార్థం త్రాగునీటి సౌకర్యం కల్పించాలని, ప్రభుత్వ కార్యాలయాల్లో మహిళల సౌకర్యార్థం మరుగుదొడ్లను ఏర్పాటు చేయాలని తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి ఎర్మ పున్నం వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో లక్ష్మయ్య, ఏవో రత్న సాయికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి కరాటే పోటీలకు ఎస్టీపీపీ విద్యార్థిని

బెల్టులు ప్రదానం చేసిన జీఎం శ్రీనివాసులు

జైపూర్, ఏప్రిల్ 7: జాతీయస్థాయి కరాటే పోటీలకు ఎస్టీపీపీ నుంచి జననీ అను విద్యార్థిని ఎంపికైనట్లు డీజీఎం పంతుల పేర్కొన్నారు. ఆదివారం సాయంత్రం ఎస్టీపీపీ ఆడిటోరియంలో నిర్వహించిన కరాటే బెల్ట్ గ్రేడింగ్ టెస్ట్ నిర్వహించి ప్రతిభ కనభర్చిన విద్యార్థులు జీఎం శ్రీనివాసులు చేతులమీదుగా బెల్టులు అందించారు. దీంతో పాటు జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థిణి జననిని అభినందించారు. ఈ కార్యక్రమంలో కోచ్‌లు మహేశ్, రాజనర్సు తదితరులు పాల్గొన్నారు.

దాడి చేసిన వారిని శిక్షించాలి : ఎఫ్‌బీవో

జన్నారం, ఏప్రిల్ 7 : ఇసుక అక్రమ రవాణాను అడ్డుకున్నందుకు తనపై దాడి చేసిన కవ్వాల్ గ్రామానికి చెందిన ఎజాజొద్దీన్, మహ్మద్ రియాజొద్దీన్‌ను శిక్షించాలని పోలీసులను డివిజన్‌లోని ఇందన్‌పెల్లి రేంజ్ బర్తన్‌పేట ఎఫ్‌బీవో రుబీనా తలత్ కోరారు. సోమవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ నెల 4న కొత్తపేట వాగు నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తుండగా ట్రాక్టర్‌ను పట్టుకొని రేంజ్ కార్యాలయానికి తరలించేందుకు యత్నిస్తుండగా ట్రాక్టర్ యజమానులైన అన్నదమ్ములు ఎజాజొద్దీన్, రియాజొద్దీన్ దుర్భాషలాడుతూ, తనపై దాడిచేశారని తెలిపింది. విషయం తెలుసుకొని అక్కడికి వచ్చిన తన భర్తపై కూడా దాడిచేసి, మొబైల్ లాక్కొని ధ్వంసం చేశారని తెలిపారు. ఈ విషయమై అదేరోజు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఆమె తెలిపారు.

క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలి

విజేత జట్టుకు కప్ అందజేస్తున్న సీఐ కుమారస్వామి, నాయకులు

తాండూర్, ఏప్రిల్ 7 : యువత క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని తాండూర్ సీఐ కే కుమారస్వామి అన్నారు. తాండూర్ సర్కిల్ కార్యాలయ ఆవరణలోని మైదానంలో 15 రోజులుగా అంజనీపుత్ర ఎస్టేట్స్ మంచిర్యాల, ఆపిల్ డెంటల్ క్లీనిక్ మంచిర్యాల నిర్వాహకులు మాసాడి కీర్తివర్ధన్, కిష్టంపేట యువ నాయకుడు సార్ల రమేశ్ దాతల సహకారంతో నిర్వహించిన తాండూర్ ప్రీమియర్ లీగ్ (టీపీఎల్ సీజన్-2) క్రికెట్ పోటీల సోమవారం ముగిశాయి. బహుమతి ప్రదానోత్సవానికి దాతలు, స్థానిక నాయకులు సూరం రవీంద్రరెడ్డితో కలిసి సీఐ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. యువత కోసం క్రీడా పోటీలు నిర్వహించడంపై నిర్వాహకులను అభినందించారు. ఫైనల్‌లో అంకుశం కింగ్స్-11 పంజాబ్ జట్టు విన్నర్‌గా నిలువగా, ఢిల్లీ క్యాపిటల్ తాండూర్ శివాజీ జట్టు రన్నర్‌గా నిలిచింది. విజేత జట్టుకు రూ. 40 వేల నగదు, కప్ అందజేశారు. రన్నర్ జట్టుకు రూ. 20 వేల నగదు, కప్ ను నిర్వాహకులు అందించారు. ఈ కార్యక్రమంలో నాయకులు, ఎస్ఐ సాగర్, అంజనీపుత్ర ఎస్టేట్ ప్రతినిధులు, సార్ల రమేశ్, ప్రీమియర్ లీగ్ నిర్వాహకులు మైదం అనిల్‌కుమార్, మాసాడి శశివర్ధన్, క్రీడాకారులు పాల్గొన్నారు.

అలరించిన కళోత్సవం

మందమర్రి, ఏప్రిల్ 7: శ్రీరామ నవమి వేడుకలను పురస్కరించుకుని మందమర్రి పట్టణంలోని యాపల్ ఏరియాలో గల కోదండ రామాలయం ఆవరణలో తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో శిఖర ఆర్ట్స్ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి నిర్వహించిన శ్రీసీతారాముల కళోత్సవం-2025 ఆద్యాంతం అలరించింది. వివిధ కళాకారుల బృందాలు నిర్వహించిన ఆటా పాట కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. తెలంగాణ ధూంధాం వ్యవస్థాపకుడు అంతడుపుల నాగరాజు సారథ్యంలో జరిగిన కార్యక్రమానిక ఉప్పులేటి నరేశ్ అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో వివిధ పార్టీలు, సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీరామ పట్టాభిషేకం

శ్రీరాంపూర్, ఏప్రిల్ 7 : శ్రీరాంపూర్ కాలనీలోని శ్రీ భక్తాంజనేయాలయంలో సోమవారం శ్రీరామ నవమి ముగింపు వేడుకలు, శ్రీరామ పట్టాభిషేకం ఘనంగా జరిగింది. వేద పండితులు కొమ్మెర సత్యనారాయణ, జగత్‌సాయిల ఆధ్వర్యంలో శ్రీరామ పట్టాభిషేకం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా శాంతి హోమం నిర్వహించారు.

మెరుగైన వైద్య సేవలందించడమే లక్ష్యం

- మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్
- ఘనంగా ప్రపంచ ఆరోగ్య దినోత్సవం

మంచిర్యాలలో పోస్టర్లను విడుదల చేస్తున్న కలెక్టర్ కుమార్ దీపక్, అధికారులు

నస్పూర్, ఏప్రిల్ 7 : ప్రపంచ ఆరోగ్యదినోత్సవం సందర్భంగా 'ఆరోగ్యకరమైన ఆరంభాలు- ఆశాజనక భవితవ్యాలు' అనే నినాదంతో ప్రజలకు మరింత మెరుగైన సేవలందించేందుకు చర్యలు తీసుకుంటామని మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని నస్పూర్‌లోని కలెక్టరేట్‌లో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో రూపొందించిన కార్యక్రమం పోస్టర్లను అదనపు కలెక్టర్ మోతీలాల్, ఆర్డీవో శ్రీనివాస్‌రావు, డీఎంహెచ్‌వో హరీశ్ రాజ్, డీపీవో వెంకటేశ్వర్‌రావు, ముఖ్య ప్రణాళిక అధికారి సత్యంతో కలిసి విడుదల చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 1948 ఏప్రిల్ 7న ప్రపంచ ఆరోగ్య సంస్థ ఏర్పాటు చేయబడినందున ప్రతి సంవత్సరం ఏప్రిల్ 7న ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని నిర్వహిస్తామని తెలిపారు. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా పునరుత్పత్తి శాతం తగ్గుతున్నందున మాతా శిశు సంరక్షణ అత్యంత ముఖ్యమైన అంశంగా తీసుకుని ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. నవజాత శిశు సంరక్షణ కోసం ప్రత్యేక ఎస్ఎస్‌సీయూ జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేయడం, హైరిస్క్ గర్భవతులను గుర్తించి ప్రత్యేక వైద్య సేవలందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రో గ్రాం అధికారులు అనిత, ప్రసాద్, కృపాబాయి, సీతారామరాజు, మాస్ మీడియా అధికారి వెంకటేశ్వర్లు తదితరులున్నారు.

ప్రపంచ ఆరోగ్య దినోత్సవ ర్యాలీ

ఆసిఫాబాద్ టౌన్, ఏప్రిల్ 7: ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకొని మండలంలోని అంకుశాపూర్‌లో ప్రభుత్వ వైద్య కళాశాల విద్యార్థులు అసిస్టెంట్ ప్రొఫెసర్లతో కలిసి ర్యాలీ తీశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ శ్రీ లక్ష్మి మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితిలో ప్రజలు తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. యువత వ్యసనాలకు బానిస కావద్దని తెలిపారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ ప్రొఫెసర్లు సతీశ్, సత్యం, హెల్త్ ఎడ్యుకేషన్ అధికారులు రషీద్, లలిత, తదితరులు

ఆసిఫాబాద్‌లో ర్యాలీ తీస్తున్న వైద్య కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు

60 మంది చిన్నారులకు కంటి పరీక్షలు

మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో హరీశ్‌రాజ్

మంచిర్యాల అర్బన్, ఏప్రిల్ 7: జిల్లాలో అంగన్‌వాడీ కేంద్రంలోని 60 మంది చిన్నారులకు కంటి వైద్యపరీక్షలు నిర్వహించినట్లు మంచిర్యాల డీఎంహెచ్‌వో హరీశ్ రాజ్ అన్నారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం మంచిర్యాల పట్టణంలోని భగవంతం వాడలోని అంగన్‌వాడీ కేంద్రంలోని చిన్నారులకు నిర్వహించిన కంటి పరీక్షల్లో సీనియర్ సివిల్ జడ్జి జిల్లా లీగల్ సొసైటీ అర్చిత మారాం రెడ్డి, జిల్లా సంక్షేమ శాఖ అధికారి రాజేశ్వరితో కలిసి మాట్లాడారు. మాతా, శిశు, హెచ్ఐవీ, సామాజిక ఆరోగ్య కేంద్రాల్లో సాధారణ ప్రసవాలు జరిగేలా, వ్యాధులు ప్రబలకుండా వంద శాతం టీకాలు అందేలా చర్యలు తీసుకుంటునట్లు పేర్కొన్నారు. వడదెబ్బ తగలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖ వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

బాలికలు ఆరోగ్య జాగ్రత్తలు తీసుకోవాలి

- కుమ్రం భీం ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే

విద్యార్థినులకు న్యాప్ కిన్స్ అందజేస్తున్న కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే

ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్, ఏప్రిల్ 7: బాలికలు సకాలంలో పోషకాహారం తీసుకుంటూ, వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తూ తమ ఆరోగ్య జాగ్రత్తలు తీసుకోవాలని కుమ్రం భీం ఆసిఫాబాద్ వెంకటేశ్ ధోత్రే అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత బాలికల ఉన్నత పాఠశాలలో మహిళ, సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పింకీస్ ఫౌండేషన్ సహకారంతో నవి సమ్మన్ ప్రాజెక్టు కింద ఏర్పాటు చేసిన బాలికలకు శానిటరీ న్యాప్కిన్స్ పంపిణీ కార్యక్రమానికి జిల్లా సంక్షేమ శాఖ అధికారి ఆడెపు భాస్కర్, పింకీస్ ఫౌండేషన్ మేనేజర్ భార్గవి భట్నాగర్, కార్యదర్శి పండిట్ శాలిని గుప్తా, అధ్యక్షుడు అరుణ్ గుప్తాతో కలిసి హాజరయ్యారు. బాలికలు సకాలంలో పౌష్టికాహారం తీసుకోవాలని, వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని తెలిపారు. పింకీస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జిల్లాలోని 35 పాఠశాలలను శానిటరీ నాప్కిన్స్ పంపిణీ చేయడం అభినందనీయమని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరీక్షల కమిషనర్ ఉదయ్ బాబు, జిల్లా సాధికారత కేంద్రం సమన్వయకర్త శారద, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, బాలికలు పాల్గొన్నారు

'టెన్త్' మూల్యాంకనం ప్రారంభం

నస్పూర్, ఏప్రిల్ 7 : మంచిర్యాల పట్టణంలోని కార్మెల్ కాన్వెంట్ హైస్కూల్‌లో సోమవారం నుంచి పదవ తరగతి జవాబు పత్రాల మూల్యాంకనం ప్రారంభమైందని డీఈవో యాదయ్య తెలిపారు. మూల్యాంకనంలో 130 మంది విధులు నిర్వర్తించారని, సోమవారం 7280 పేపర్లు మూల్యాంకనం చేసినట్లు తెలిపారు.

ప్రజల భద్రతే లక్ష్యం

మంచిర్యాల అర్బన్, ఏప్రిల్ 7: ప్రజల భద్రత కోసమే కమ్యూనిటీ పోలీసింగ్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు మంచిర్యాల పట్టణ సీఐ ప్రమోద్ కుమార్ తెలిపారు. సోమవారం మంచిర్యాల జిల్లా కేంద్రంలోని సూర్యనగర్‌లో కమ్యూనిటీ పోలీసింగ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీ వాసులకు సమావేశం నిర్వహించి సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని, సైబర్ నేరాలు, గంజాయి వాటిపై అవగాహన కల్పించారు.

మూగజీవిపై గుర్తు తెలియని వ్యక్తుల దాడి

కాగజ్‌నగర్, ఏప్రిల్ 7 : శ్రీ రామ నవమి రోజు ఆదివారం సాయంత్రం కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్‌లో గుర్తు తెలియని వ్యక్తులు ఓ పశువు తల, ముఖంపై కత్తులతో విచక్షణ రహితంగా దాడి చేశారు. కాసేపటికే పశువు మృతి చెందడంతో హిందూ సంఘాల నాయకులు మృతి చెందిన పశువు వద్దకు వెళ్లి పరిశీలించారు. పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. హిందూ సంప్రదాయం ప్రకారం ఆవును ఖననం చేశారు. మూగజీవిపై పైశాచికంగా దాడి చేసిన దుండగులను గుర్తించి కఠినంగా శిక్షించాలని హిం దూ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు.

వరి ధాన్యం కొనుగోలుకు ఏర్పాట్లు

నస్పూర్, ఏప్రిల్ 7 : వరిధాన్యం కొనుగోలు కోసం ముందస్తుగా ఏర్పాట్లు చేస్తున్నట్లు మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం నస్పూర్‌లోని కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ మోతీలాల్, పౌరసరఫరాల అధికారి బ్రహ్మారావు, డీఆర్డీవో కిషన్, జిల్లా వ్యవసాయాధికారి కల్పన, జిల్లా పౌరసరఫరాల మేనేజర్ శ్రీకళతో కలిసి సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ యాసంగి 2024-25 సంవత్సరానికి ఏ గ్రేడ్ రకానికి రూ.2,320, సాధారణ రకానికి 2,300 మద్దతు ధర నిర్ణయించినట్లు తెలిపారు. కొనుగోలు కేంద్రాల వద్ద నీడ, తాగునీరు, ఇతర సౌకర్యాలు కల్పించడంతో ఓఆర్ఎస్ మెడికల్ కిట్‌లు అందుబాటులో ఉంచాలని తెలిపారు. ప్యాడీ క్లీనర్లు, గన్నీ సంచులు సమకూర్చుకోవాలన్నారు. సన్నరకం, దొడ్డు రకం ధాన్యాన్ని వేర్వేరుగా కొనుగోలు చేయాలని తెలిపారు. కొనుగోలు వివరాలను ట్యాబ్‌లలో నమోదు చేయాలని సూచించారు. మొత్తం 319 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు పంపించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మహిళా సమాఖ్య సభ్యులు, ఏపీఎంలు, సీసీలు, రైసుమిల్లర్ల సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆర్కే 8 డిస్పెన్సరీలో ప్రపంచ ఆరోగ్య దినోత్సవ సదస్సు

శ్రీరాంపూర్, ఏప్రిల్ 7 : శ్రీరాంపూర్ ఏరియా ఆర్కే 8 డిస్పెన్సరీలో సోమవారం ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని నిర్వహించారు. ముందుగా జీఎం శ్రీనివాస్ దవాఖానలో ప్యాలల్ బార్, ఫిజియో స్టేయిర్, ల్యాడర్‌ను ప్రారంభించారు. ఎంవీటీసీలో శిక్షణ పొందుతున్న 44 మంది యువ కార్మికులు రక్తదానం చేయగా వారికి ప్రశంసా పత్రాలు అందించారు. రక్తదాతలే ప్రాణదాతలన్నారు. ఆరోగ్య జాగ్రత్తలతో కూడిన కరపత్రాన్ని జీఎం విడుదల చేశారు.

నేడు ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్

మంచిర్యాల (ఏసీసీ), ఏప్రిల్7: తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్ పవర్ కంపెనీ లిమిటెడ్ (టామ్కామ్), తెలంగాణ ప్రభుత్వం లోని కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగారాల శాఖ ఆధ్వర్యంలో రిజిస్టర్డ్ రిక్రూట్మెంట్ ఏజెన్సీ ద్వారా అర్హత, నైపుణ్యం కలిగిన, సెమీ స్కిల్డ్ కార్మికులకు విదేశాలలో ఉద్యోగాల భర్తీ కోసం ఈ నెల 8న జిల్లాలోని జన్నారంలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్ నిర్వహిస్తున్నామని జిల్లా ఉపాధి కల్పన అధికారి రవి కృష్ణ సోమవారం తెలిపారు. సిరామిక్ కాస్టర్, జూనియర్ ప్రాసెస్ ఆపరేటర్, ప్రెస్ మెకానిక్, పాలిషింగ్ మెకానిక్, డిజైనర్, ప్రొడక్షన్ సూపర్‌వైజర్, బాడీ ప్రిపరేషన్ ఇన్‌చార్జి, ఫోర్క్లిఫ్ట్ ఆపరేటర్, షావెల్ ఆపరేటర్లకు యూఏఈలో ఖాళీలు ఉన్నాయని తెలిపారు. అభ్యర్థులు 18-40 సంవత్సరాల మధ్య వయస్సుతో పాటు అర్హతలు కలిగి ఉండాలని తెలిపారు. వివరాలకు 9440049937, 9440049861, 9440051452 నంబర్లలో సంప్రదించవచ్చని ఆయన తెలిపారు.

'సింగరేణి నీటిబిందువు-జల సింధువు'ను ప్రారంభిస్తాం

- సీఎండీ ఎన్ బలరామ్

శ్రీరాంపూర్, ఏప్రిల్ 7 : సింగరేణి ప్రాంతంలో భూగర్భ జలాల అభివృద్ధికి 'సింగరేణి నీటిబింధువు-జల సింధువు' అనే నినాదంతో ఒక విశిష్ట పర్యావరణ హిత, ప్రజోపయోగ కార్యక్రమాన్ని చేపట్టాలని నిర్ణయించినట్లు సీఎ